క్లుప్తంగా

రోగులకు వైద్యపరీక్షలు



నెలబల్లిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ పద్మావతి

దొరవారిసత్రం: నెలబల్లి, వేణుంబాకం గ్రామాల్లో మంగళవారం డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారులు రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున ఎండల్లో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రోగులకు తెలిపారు. కూలీ పనులు చేసుకునే వారు ఎండ తీవ్రత నుంచి ఉపసమనం పొందేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. వైద్యాధికారులు చైతన్య, పద్మావతి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శిఖర కలశ స్థాపన



కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

చిల్లకూరు: చింతవరం కొత్తపాళెంలో గ్రామదేవత అంకమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో మంగళవారం ఆలయ శిఖర కలశ ప్రతిష్ట అట్టహాసంగా జరిపారు. ఆలయంపై ప్రతిష్టించే మూడు పంచలోహ శిఖరాలను గ్రామంలో ఊరేగించారు. చింతవరం ఎంపీటీసీ సభ్యురాలు పాలూరు మాధవి, శ్రీనివాసులు, రవి తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల పరిశీలన



విద్యార్థులను ప్రశ్నిస్తున్న డిప్యూటీ డీఈఓ

తడ: స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాట్లు, వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఆయన వెంట హెచ్‌ఎంలు మల్లికార్జునరావు, నరసింహారావు ఉన్నారు.

ఆటో బోల్తా



చిల్లకూరు: రోడ్డుకు అడ్డుగా వస్తున్న గేదెను తప్పించబోయి అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు.. తూర్పుకనుపూరులో జరిగే ముత్యాలమ్మ జాతరలో నెల్లూరుకు చెందిన కొంతమంది వివిధ రకాల వస్తువులను విక్రయించుకునేందుకు ఆటోలో బయలుదేరారు. ఆటో మండలంలోని నాంచారమ్మపేట సమీపంలోకి వచ్చే సరికే రోడ్డుపై గేదె అడ్డుగా రాగా దానిని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొని అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాక పోవడంతో తృటిలో ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత



చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీఓ

చిల్లకూరు: లక్షలాది మంది భక్తులు విచ్చేసే జాతరలో ప్రజలు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం మెరుగుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. తూర్పుకనుపూరులో మంగళవారం ప్రారంభమైన జాతరలో ఎక్కువ శాతం కోళ్ల వ్యర్థాలు వచ్చే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు వీధులు, ఆలయ పరిసరాల్లోనూ శుభ్రం చేయిస్తున్నామన్నారు. అలాగే చెత్త కుప్పలు పేరుకు పోయిన ప్రాంతాల్లో యంత్రాల సాయంతో వాటిని తొలగించి దూరంగా తీసుకెళుతున్నామని తెలిపారు. జాతర మూడు రోజుల పాటు విడతల వారిగా పంచాయితీ కార్యదర్శులను నియమించామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, మాధవి, సాయిరామమ్మ తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కోట: స్థానిక దళితవాడకు చెందిన కస్తూరయ్య(45) మంగళవారం ఇంట్లో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. అపస్మారకస్థితిలో ఉన్న అతన్ని కుటుంబసభ్యులు కోట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గూడూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు.

గేదెలను ఢీకొన్న బస్సు

కోట:మండలంలోని వీరారెడ్డిసత్రం వద్ద మంగళవారం ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీకి చెందిన బస్సు గేదెలను ఢీకొంది. వీరారెడ్డిసత్రం గ్రామానికి చెందిన వలిపి వెంకటేశ్వర్లు గేదెలను రోడ్డుపై తోలుకుని వెళుతుండగా గేదెలను బస్సు ఢీకొంది. ప్రమాదంలో ఓ గేదె సంఘటన స్థలంలోనే మృతి చెందగా మరో గేదెకు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బస్సును పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ పుల్లారావు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



రాపూరు: బాలికల గురుకులంలో మాత్రలు మిగేస్తున్న ఎంపీడీఓ వీర్రాజు



దొరవారిసత్రం: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సైదాపురం: విద్యార్థుల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. సైదాపురం ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఆయన మాట్లాడుతూ 1–19 ఏళ్ల మధ్య వయస్సుగల వారందరూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకునేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ప్రభుత్వం, ప్రైవేట్, అంగన్‌వాడీకేంద్రాలు, హాస్టళ్లలో విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణి, ఎంఈఓ దయాకర్, హెచ్‌ఎం పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి: పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలను ఆ కళాశాల ప్రిన్స్‌పల్ డాక్టర్ కె అరుణ్ కుమార్, వైద్యఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా రక్తహీనత సమస్య వస్తుందని, దీని నివారణకు ప్రభుత్వం 1 –19 ఏళ్లలోపు వారందరికీ మాత్రలు పంపిణీ చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వెంకటసుబ్బయ్య, మంజునాథరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: మండలంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు. రాపూరు బాలికల గురుకుల పాఠశాల్లో ఎంపీడీఓ వీర్రాజు విద్యార్థినులకు నులిపురుగుల మాత్రలను అందించారు. ఈ కార్యక్రమంలో వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది లింగమూర్తి, కాంతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో ఆరోగ్యం

డక్కిలి: ఆరోగ్యవంతమైన పిల్లల కోసం ఆల్బెండజోల్ మాత్రలు ఎంతో ఉపయోగపడుతాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి బిందు ప్రియాంక తెలిపారు. మంగళవారం ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో వైద్య ఆరోగ్య సిబ్బంది అల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలు, జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాల్లో 7,027 మంది విద్యార్థులకు గాను 6,281మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

దొరవారిసత్రం: తొగరాముడి, దొరవారిసత్రం పీహెచ్‌సీల పరిధిలోని పలు పాఠశాలల్లో మంగళవారం జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వైద్యాధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. అలాగే విద్యర్థులకు విధిగా మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీ...

ఓజిలి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్యసిబ్బంది సహాయంతో విద్యార్థులకు మంగళవారం నులిపురుగులు మాత్రలను మింగించారు. పాఠశాలలో 186 మంది విద్యార్థులకు నులిపురుగులు మాత్రలను మింగించి, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే చిలమానుచేను, ఆర్మేనిపాడు గ్రామాల్లోని పాఠశాలలో వైద్యాధికారి మాధవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగులు మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శైలజ, వైద్యాధికారి డానియల్, సీహెచ్‌ఓ సుబ్బరామయ్య, హెచ్‌ఎం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలువాయిలో..

కలువాయి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. పిల్లల్లో రక్తహీనత నివారణ చర్యలు, హ్యాండ్ వాష్ గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులందరితో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, డాక్టర్ రామకుమారి, డాక్టర్ ప్రియాంక, హెచ్‌ఎం జనార్దనరెడ్డి పాల్గొన్నారు.



సైదాపురం: మాత్రలను మింగిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, వైద్యాధికారి



వెంకటగిరి: మాత్రలు పంపిణీ చేస్తున్న సిబ్బంది



ఓజిలి: విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది



డక్కిలి: ఆల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్న వైద్యాధికారి



కలువాయి: విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలను మింగిస్తున్న అధికారులు

ముత్యాలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులు





గూడూరులో బస్సును ప్రారంభిస్తున్న డీఎం తదితరులు, సూళ్లూరుపేట: బస్సులకు పూజలు చేస్తున్న చెంగాళమ్మ ఆలయ ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి

గూడూరు: చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరులో ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న ముత్యాలమ్మ జాతరకు ఆర్టీసీ బస్సులు నడవనుంది. జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నుంచే కాకుండా, పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ముత్యాలమ్మ ఆలయానికి బస్సు సర్వీసులు ప్రారంభించారు. గత ఏడాదితో పోల్చితే, ప్రస్తుతం బస్సు చార్జీలు పెరిగినప్పటికీ, భక్తుల సౌకర్యార్థం యథాతథంగానే టికెట్ ధరలుంటాయని గూడూరు ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరావు తెలిపారు. గూడూరుతోపాటు, నెల్లూరు–1, నెల్లూరు –2, వాకాడు, సూళ్లూరుపేట డిపోల నుంచి 120 బస్సులను నడిపే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. గూడూరు నుంచి కనుపూరుకు 40 బస్సులు తిరగనున్నాయి. అలాగే నెల్లూరు 1 నుంచి కనుపూరుకు 15 బస్సులు గూడూరు బైపాస్ మీదుగా తిరుగుతాయి. ఈ మేరకు టికెట్ రూ.90 ఉంటుందని తెలిపారు. నెల్లూరు– 2 డిపో నుంచి ముత్తుకూరు మీదుగా, గుమ్మళ్లదిబ్బ కనుపూరుకు మరో 15 బస్సులను నడవనున్నారు. వాకాడు డిపో నుంచి 35 బస్సులును కోట నుంచి కనుపూరు, అలాగే నాయుడుపేట నుంచి కనుపూరుకు నడవనున్నారు. సూళ్లూరుపేట నుంచి 15 బస్సులను వాకాడు, కోట మీదుగా తిప్పనున్నారు.

కనుపూరు జాతరకు ప్రత్యేక బస్సులు

సూళ్లూరుపేట: చిల్లకూరు మండలం కనుపూరు ముత్యాలమ్మ జాతరకు సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఏర్పాటు చేసిన బస్సులకు స్థానిక చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి చేతులు మీదుగా మంగళవారం పూజలు చేసి, బస్సులను ప్రారంభించారు. మంగళ, బుధ, గురు, శుక్రవారాల్లో నాలుగురోజుల పాటు సుమారు 15 బస్సులను ప్రత్యేకంగా తిప్పుతున్నామని డిపో మేనేజర్ మల్లికార్జున్ తెలిపారు. సూళ్లూరుపేట నుంచి కనుపూరుకు రూ.90 చార్జీ వసూలు చేస్తామని, శుక్రవారం ఉదయం 10 గంటలదాకా బస్సులు తిరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎం శేఖర్, ఏ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణానికి సహకరించండి

- ఆర్థిక శాఖ కార్యదర్శి రావత్‌ను కలిసిన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



రావత్‌కు సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: పట్టణంలో అసంపూర్తిగా ఆగిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించడానికి సహకరించాలని రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి రావత్‌ను విజయవాడలో మంగళవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కలిసి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు పట్టణ ప్రజల చిరకాల కోరిక ఫ్లైఓవర్ అని, ఈ క్రమంలోనే గతంలో పలు పర్యాయాలు, పలు శాఖల అధికారులను కలిసి సమస్యను వివరించామన్నారు.ఈ పనులను తిరిగి ప్రారంభించేందుకు వస్తు సామగ్రి ధరల్లో భారీ వ్యత్యాసం కారణంగా, కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదన్నారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులతో కలిసి, మాట్లాడించామని తెలిపారు. ఇకనైనా ఈ పనులు తిరిగి ప్రారంభించేలా చూడాలని రావత్‌ను కోరామన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



వస్తువులను హెచ్‌ఎంకు అందిస్తున్న హితిక్‌రెడ్డి

చిల్లకూరు: ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే వసతులతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని తమ్మినపట్నంలోని కోదండరామస్వామి దేవస్థానం చైర్ పర్సన్ యరటపల్లి పృథ్వీరెడ్డి తెలిపారు. మండలంలోని వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం వారి కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం 400 మంది విద్యార్థులకు భోజనం పెట్టారు. పాఠశాలక కావాల్సిన వస్తు సామగ్రిని వితరణ చేశారు. హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి యరటపల్లి కుటుంబ సభ్యులు ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు. కోదండరామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ శరణ్ రెడ్డి, హితిక్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దారా కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ మల్లికార్జున, కావలి సతీష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నేతలు

తడ: మండలంలోని పెరియవట్టు పంచాయతీలోని 20 గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన పక్కాఇళ్లకు మంగళవారం భూమిపూజ చేశారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాము ఇళ్లు నిర్మించుకోలేమని గిరిజనులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు విన్నవించారు. దీంతో ఆయన చెన్నైకి చెందిన జైన్ సంస్థ ప్రతినిధులతో చర్చించి, ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం కుదిర్చారు. ఈ నేపథ్యంలో తొలివిడతలో 10 ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జీరత్నం, పెరియవట్టు సర్పంచ్ చిన్నప్పన్, నాయకులు రాధాకృష్ణన్, రవిరెడ్డి పాల్గొన్నారు.

తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో గూడూరు చిన్నారి ప్రతిభ



సాయి సింగ్

గూడూరు: రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో గూడూరుకు చెందిన మూర్తేష్ సాయిసింగ్ తృతీయస్థానాన్ని కైవసం చేసుకుని, గూడూరుకు గుర్తింపు తీసుకొచ్చాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా ఎలమంచిలి వాగ్దేవి జూనియర్ కళాశాలలో రెండు రోజుల క్రితం సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గూడూరు ఎగువవీరారెడ్డిపల్లె ప్రాంతానికి చెందిన జశ్వంత్‌సింగ్, ఝాన్సీరాణి దంపతుల కుమారుడు మూర్తేష్ సాయిసింగ్ ప్రతిభను చాటి, తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుని కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆ చిన్నారిని పలువురు అభినందించారు.

నిఘా నీడలో ఇంటర్మీడియట్ పరీక్షలు



ఎస్‌కేఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

గూడూరు: సీసీ కెమెరాల నిఘాలో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్‌కేఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, చీఫ్ సూపరింటెంట్ ఎస్ కోటేశ్వరరావు, పరీక్షా కేంద్రం డిపార్ట్‌మెంట్ అధికారి జీ సాయికిరణ్ తెలిపారు. ఎస్‌కేఆర్ జూనియర్ కళాశాలలో ఈ మేరకు మంగళవారం ఏర్పాట్లను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించే ప్రతి తరగతి గదిలోనూ సీసీ కెమెరాలను అమర్చినట్లు తెలి పారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశామని చెప్పారు. గూడూరు పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని 1,466 మంది విద్యార్థు లు ఈ పరీక్షలు రాయనున్నారని తెలిపారు. సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో 270 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో 351, ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 278, డీఆర్‌డబ్ల్యూ జూనియర్ కళాశాలలో314, స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కళాశాలో 253 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

కోట: ఇంటర్ మీడియట్ పరీక్షల నిర్వహణకు మండలంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోట ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాల, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రెండు కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం 638 మంది, ద్వితీయ సంవత్సరం 722 మంది పరీక్షలు రాయనున్నారని ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

రాపూరులో..

రాపూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో బుధవారం నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపల్ వెంకట్‌నాయక్ తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలకు 231మంది, ద్వితీయ సంవత్సరం 189 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఊపందుకుంటున్న నిమ్మ ధరలు



మార్కెట్‌కు చేరిన నిమ్మకాయలు

గూడూరు: ఎండలు మండుతున్నాయి.. నిమ్మ ధరలకూ రెక్కలొచ్చి రోజు రోజుకూ ఊపందుకుంటున్నాయి. దీంతో నిమ్మ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు రోజులుగా నిమ్మ ధరలు కిలో రూ.90 నుంచి రూ.95 వరకూ పలికాయి. లూజు బస్తా ధర రూ.7,200 నుంచి, రూ.7,600 వరకూ పలుకుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం కిలో రూ.90 పలికాయి. బుధవారం సెలవు కావడంతో గురువారం మార్కెట్ మరింత ఆశాజనకంగా ఉంటుందని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది కూడా నిమ్మ ధరలు బాగా పలకడంతో, అప్పులు తీరి ఆర్థికంగా స్థిరపడుతున్న నిమ్మ రైతులకు, ఈ ఏడాది మార్చి రెండో వారంలోనే ధరలు ఆశాజనకంగా ఉండడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఉత్తర భారత దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో లారీల సమ్మె కారణంగా, నిమ్మ కాయల ధరలు గత నాలుగు రోజులతో పోలిస్తే, కిలోపై రూ.5 తగ్గాయని, ఆ సమ్మె ఆగిపోతే మరింతగా పెరిగే అవకాశాలున్నాయని, అటు వ్యాపారులు చెబుతున్నారు.

సులభరీతిలో బోధన చేయాలి



డక్కిలి: మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ

డక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సులభరీతిలో బోధన చేయాలని ఎంఈఓ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు తెలిపారు. మండలంలోని తిమ్మాయిపాళెం దళితవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి వర్క్‌బుక్‌ను పూర్తి చేసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించలన్నారు. పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కొత్త మెనూను సక్రమంగా అమలు చేసేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవలన్నారు.

ఈ–క్రాప్ నమోదు జాబితా విడుదల



జాబితా చదువుతున్న వ్యవసాయ సహాయకురాలు

సైదాపురం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం సర్పంచ్ శారద అధ్యక్షతన ఈ–క్రాప్ నమోదు జాబితాను ఏఓ హైమావతి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో పండించే వరి, బొప్పాయి, పత్తి పంటలను పక్కాగా ఈ–క్రాప్ నమోదు చేశామన్నారు. ఈ–క్రాప్ నమోదు చేసిన పంటలకు ఏమైనా నష్టం వాటిల్లితే ప్రభుత్వ నుంచి ఆర్థిక సహాయం అందేందుకు వీలుటుందన్నారు. నమోదు చేసిన జాబితాను రైతు భరోసా కేంద్రంలో ప్రదర్శించామని చెప్పారు. నమోదు కాని రైతులు తమకు సమాచారం అందిస్తే వారి పంటలను ఇప్పడు కూడా నమోదు చేస్తామన్నారు. అనంతరం వ్యవసాయ సహాయకురాలు పుష్ప జాబితాను చదివి వినింపించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ, సహాయకురాలు పుష్ప తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు–భూరక్షతో రైతులకు మేలు



తాళ్వాయిపాడులో గ్రామ సర్వేమ్యాప్‌ను పరిశీలిస్తున్న డీపీఓ రాజశేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంతో రైతులకు మేలు చేకూరుతుందని జిల్లా పంచాయతీ అధికారి ఏ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాళ్వాయిపాడు గ్రామంలో పర్యటించిన ఆయన భూ రీసర్వే వివరాలను తెలుసుకున్నారు. రైతులందరూ భూరీసర్వే చేసుకోవడంతో భవిష్యత్‌లో భూ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అనంతరం శిరసనంబేడు గ్రామంలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. నివాసాల నుంచి వెలువడే చెత్తా, చెదారాలను నిర్లక్ష్యంగా వీధుల్లో పడేయకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లుకు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకటరమణ, సర్పంచ్ గుంటపూడి పెంచలయ్య, మురళీకృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వసంత్‌కుమార్, తిరుమలరావు, గ్రామ సర్వేయర్ శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, వ్యవసాయశాఖ సిబ్బంది

కోట: ప్రకృతి వ్యవసాయం తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బుధవారం చంద్రశేఖరపురంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ రసాయన ఎరువుల మోతాదు తగ్గించి, సేంద్రియ ఎరువులు, కషాయాలను వినియోగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలసి ర్యాలీ చేశారు. ఎంసీఏ శ్రీనివాసులు, పద్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.